## అక్రమ కట్టడాలపై ఫిర్యాదు

చాదర్‌ఘాట్: ప్రజావాణిలో అక్రమ కట్టడాలపై రెండు ఫిర్యాదులు వచ్చినట్లు డీసీ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓల్డ్‌మలక్‌పేట, అజంపురా నుంచి ఫిర్యాదులు వచ్చాయని వాటిని పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతామన్నారు.

# కానరాని పచ్చదనం.. వ్యర్థాలకు నిలయం



హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలోని పార్కు ఇలా..

ద్వారకా తిరుమల కాలనీలోని పార్కులో పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలు

పార్కు స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

పచ్చదనంలో కళకళ లాడాల్సిన పార్కులు పిచ్చిమొక్కలు, గడ్డి, వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. పార్కుల నిర్వహణ లేక కళావిహీనంగా మారుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ పార్కుల్లో చెత్తా చెదారంతో పేరుకుపోయాయి. హస్తినాపురం డివిజన్ పరిధిలోని ద్వారకా తిరుమలకాలనీ, హస్తినాపురం నార్త్ ఎక్స్ టెన్షన్ కాలనీలోని పార్కులలో పిచ్చిమొక్కలు భారీగా పేరుకుపోయాయి. దీనికి తోడు పార్కు ఎదుట వ్యర్థాలు పేరుకుపోవడంతో ముక్కుపూటలదిరే దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. ఆయా కాలనీవాసులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఎవరూ పార్కుకు రావడం లేదు. దీంతో పార్కులో భారీగా గడ్డి పెరిగి విష సర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.ఉన్నతాధికారులు స్పందించి అధ్వానంగా మారిన పార్కులపై దృష్టి సారించి పచ్చదనం పెంపొందించేలా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

–హస్తినాపురం

## రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమాట రూ.15, వంకాయ రూ. 28, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 40, కాకర రూ. 35, బీర రూ. 50, క్యాబేజి రూ. 18, ఫ్రెంచిబీన్స్ రూ. 45, క్యారట్ రూ. 32, దొండ రూ. 40–45, చిక్కుడు రూ. 45, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 45, క్యాప్సికం రూ. 50, ఆలు రూ. 25, దోస రూ. 23, సొరకాయ రూ. 15, పొట్లకాయ రూ. 18, ఉల్లిగడ్డ రూ. 35, చామగడ్డ రూ. 37. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు.. వినయ్‌నగర్, గణేష్ టెంపుల్, శ్రీకార్ హోటల్, బోజిరెడ్డి కాలేజ్, మాతృశ్రీ కాలేజ్, సక్సెస్ స్కూల్, ధోబీఘాట్, ఐఎస్‌సదన్, మాదన్నపేట మండి, మెహిదిపురం, ధోబీఘాట్ మెయిన్‌రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

## ఈ-నామ్‌ను కచ్చితంగా పాటించాలి

చాదర్‌ఘాట్: ఈ నామ్ పద్ధతిని కచ్చితంగా పాటించాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నామ్‌ను పక్కాగా అమలుకు వ్యాపారులు సహకరించాలని తెలిపారు. మిర్చి సీజన్ నేపథ్యంలో హమాలీలు, చాట్ కార్మికులకు మిర్చి ఘాటు నుంచి ఉపశమనం కల్పించడానికి తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మార్కెట్ ఫీజు రూ. 9 కోట్లు వసూలైనట్లు తెలిపారు.

# బాలల సదనంలో క్రిస్మస్ సందడి



చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న అధికారులు

సైదాబాద్: సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ చార్వాక్, సదనం బాలలతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మీర్జాఅలీబేగ్, ఏసీపీఎస్ నవీన్‌కుమార్, అఫ్జల్ సహేలీ, సంగమేశ్వర్, మైథిలీ, గోపీకుమార్ పాల్గొన్నారు.

**ఆర్టీసీ డిపోలో..**

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్టీసీ హైదరాబాద్–2 డిపోలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించినట్లు మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు.



క్రిస్మస్ వేడుకల్లో కృష్ణమూర్తి, సిబ్బంది

యేసుక్రీస్తు పుట్టుక గురించి పాస్టర్ శేఖర్ బాబు వివరించారు. కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. ప్రతి ఒక్కరూ శాంతిమార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉషారాణి, ఎంఎఫ్ సతీష్, రమాదేవి, ఉమాపతి పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మలక్‌పేట: మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సర్కిల్–6 టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సౌత్‌ఈస్ట్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ డీసీపీ గజానంద్, సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్ పర్యవేక్షణలో ఫుత్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని సహదేవ్ స్వీట్ హౌజ్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఉన్న డబ్బాలు, పండ్ల దుకాణాలు, తోపుడు బండ్లు, ప్లాసిక్ కవర్‌తో ఏర్పాటు చేసుకున్న డేరాలను తొలగించారు. ఈ నెల 20 తేదీన ఆక్రమణదారులకు నోటీసులు అందజేసి తొలగింపు చర్యలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఫుట్‌పాత్ ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఆక్రమణలు తొలగింపుజేస్తున్న ఏసీపీ చంద్రకుమార్

## మంత్రికి ఆహ్వానం



మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వాన పత్రికను అందజేసిన శ్రీనివాసరావు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధిలోని జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కులో నెల 24 నుంచి 29 వరకు ఋగ్వేద, యజుర్వేద, సామవేద, హవన సహిత గజేంద్రమోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని వైదిక విజ్ఞాన ట్రస్టు వ్యవస్థాపకులు వాడ్రేవు శ్రీనివాసరావు, ధర్మ రక్ష సంస్థ వ్యవస్థాపకులు చిట్టి హనుమత్ శాస్త్రీ పేర్కొన్నారు. సోమవారం వారు మంత్రి శ్రీధర్‌బాబును కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

## ప్రత్యేక పూజలు

సైదాబాద్: శివకేశవులకు ప్రత్యేక పూజలు చేసే ధనుర్మాసం ఎంతో పవిత్రమైందని సైదాబాద్ జయనగర్‌లోని దివ్యజ్యోతి ఫౌండేషన్ నిర్వాహకుడు అనంత్‌రెడ్డి స్వామిఅన్నారు. సోమవారం ఆయన పంచగిరిసన్నిధానం అయ్యప్పస్వాములతో కలిసి సోమనాథ్ దేవాలయంలో ప్రత్యేక పూజలు, శివాలయంలోని స్వామివారికి అభిషేకం జరిపించారు.



పూజల్లో పాల్గొన్న అనంత్‌రెడ్డి స్వామి

## ప్రభుత్వ స్థలం కబ్జాపై అధికారుల స్పందన

అక్రమ నిర్మాణాల కూల్చివేత



సాక్షి ఎఫెక్ట్..

బోడుప్పల్: ప్రభుత్వ స్థలం కబ్జాపై అధికారులు స్పందించారు. సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన' ప్రభుత్వ స్థలం కబ్జా' కథనానికి స్పందించిన మున్సిపల్, మండల రెవెన్యూ అధికారులు నిర్మించిన అక్రమ నిర్మాణాలను జేసీబీతో సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలింగం మాట్లాడుతూ.. 13వ డివిజన్‌లోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లు, 14వ డివిజన్‌లో అనుమతులు లేకుండా చేపట్టిన షెడ్డును కూల్చివేసినట్లు వివరించారు. 2019 మున్సిపల్ యాక్ట్‌ను అనుసరించి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తామని స్పష్టం చేశారు. నిర్మాణదారులు ఇంటి అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టడంతో పాటు నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. తహసీల్దార్ హసీనా, ఆర్ఐ రాకేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రయాగ కుంభమేళాను హరిత కుంభమేళాగా మారుద్దాం

వనస్థలిపురం: ప్రయాగ కుంభమేళాను హరిత కుంభమేళాను చేద్దాం, మన జీవ నదులను కలుషితం బారి నుంచి కాపాడుకుందాం అంటూ ఆర్ఎస్ఎస్ దిల్‌సుఖ్‌నగర్ విభాగ్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనవరి 13 నుంచి త్రివేణి సంగమం ఐన ప్రయాగలో జరగనున్న కుంభమేళాకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం సేకరించిన స్టీల్ ప్లేట్లు, బట్ట సంచులను ప్రదర్శిస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మేళాలో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, క్యారీ బ్యాగులకు బదులుగా స్టీల్ ప్లేట్లు, బట్ట సంచులు వాడాలని సూచించారు. ర్యాలీలో పర్యావరణ వేత్తలు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, జాగృతి అభ్యుదయ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.





ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

## అభినందనలు



బి.శైలజ డైరెక్టర్

చాదర్‌ఘాట్: ట్రాన్స్‌జెండర్స్ సోమవారం నుంచి విధుల్లో చేరిన (ట్రాఫిక్ అసిస్టెంట్‌గా) సందర్భంగా వికలాంగులు, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ శాఖ డైరెక్టర్ బి.శైలజ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శైలజా మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్స్ శాఖకు మంచి పేరు తెచ్చి రాష్ట్రంలోనే అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాష్ట్రం నుంచి 39 మంది విధుల్లో చేరటం అభినందనీయమన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని కట్టడి చేయాలి



హస్తినాపురం: రాష్ట్రంలోని ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని కట్టడి చేయాలని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు అన్నారు. సోమవారం విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, కమిషన్ సభ్యులు పి.ఎల్. విశ్వేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేటర్ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని, గత నెలలో హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో గేటు విరిగి బాలుడు చనిపోవడం జరిగిందని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వినతిలో కోరారు.

## శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్నడిప్యూటీ మేయర్

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని భవానీ ఎన్‌క్లేవ్‌లో నూతనంగా నిర్మించనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ పనులకు సోమవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, నాయకులు సంతోష్‌రెడ్డి, నర్సిరెడ్డి, తిరుమలేష్, రమేష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.

# బాలకృష్ణ గురుస్వామికి ఘన స్వాగతం



బాలకృష్ణ గురుస్వామితో కార్పొరేటర్ లచ్చిరెడ్డి

నాగోలు: గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలంటూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బాలకృష్ణ గురుస్వామి గత మూడు నెలలుగా పాదయాత్ర నిర్వహిస్తున్నారు. సోమవారం కొత్తపేట భవానీ మాత దేవాలయం వద్దకు వచ్చిన సందర్భంగా హనుమాన్ యువసేన యాశ్వాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలకృష్ణ గురుస్వామి మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రుషి, అఖిల్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, రాజేందర్, భాస్కర్, కిరణ్ కుమార్, వినోద్, తరుణ్ సింగ్ ఠాగూర్, అవినాష్, వరుణ్, వేణు, సంప్రీత్, యశ్వంత్ పాల్గొన్నారు.

**వనస్థలిపురంలో..**

వనస్థలిపురం: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన గోరక్ష మహా పాదయాత్ర ఇటీవల నగరానికి చేరుకుంది. సోమవారం వనస్థలిపురం ప్రశాంత్ నగర్‌లోని కనకదుర్గ దేవాలయంలో పలువురు బాలకృష్ణ గురుస్వామికి స్వాగతం పలికారు. బీఎన్ రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, గో రక్షక్ యాదగిరిరావు, ఆలయ చైర్మన్ భుజంగరెడ్డి, నాగేష్ గౌడ్, చంద్రకాంత్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, శ్యాంకుమార్, చిన్నయాదవ్, పవన్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.



గురుస్వామికి స్వాగతం పలుకుతున్న యశ్వాల్‌గౌడ్

# పనుల్లో నాణ్యత పాటించాలి

బడంగ్‌పేట్ మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడలోని 24వ డివిజన్ ఏఆర్‌సీఆర్ కాలనీలో సోమవారం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి హాజరై పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రామిడి రాంరెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్దన్‌రెడ్డి, డీఈఈ నర్సింహరాజు, నాయకులు రవికాంత్‌రెడ్డి, ఏదుళ్ల ప్రతాప్ రెడ్డి, రంజిత్‌రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మేయర్

**విద్యార్థులకు శుభాకాంక్షలు**

కార్పొరేషన్ కేంద్రంలోని శ్రీగాయత్రి స్కూల్ వార్షికోత్సవం, సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మేయర్ పారిజాత ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో గాయత్రి స్కూల్ చైర్మన్ వేల్పు విజయ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ప్రసాద్, ప్రిన్సిపాల్ సామ వినిత్‌రెడ్డి, డైరెక్టర్ అనూష, నాయకులు రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, ఎ.ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అనాథలకు చేయూత



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు ఇంటర్నేషనల్ లయన్స్ డిస్ట్రిక్ట్–320సీ గవర్నర్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో దుప్పట్లు స్టేషనరీ, స్కూల్ బ్యాగులు తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. 1000 మంది పిల్లల సౌకర్యార్థం వివిధ సామగ్రి అందజేశామని భవిష్యత్‌లో మా సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, సుకేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రావు, సురేష్ కుమార్, లక్ష్మి మూర్తి, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

## లక్ష్యసాధనకు కృషి చేయాలి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లోని మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్‌లో రెండు రోజుల పాటు సంస్కృతి ద కల్చరల్ ఫెస్ట్ పేరుతో వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎయిర్ కమాండర్ టీమ్ లీడర్(డీఆర్‌డీవో) అలోక్ భయన, ఫిలిం ప్రేమ్ యాక్టర్, డైరెక్టర్ కేవీ ప్రదీప్ హాజరయ్యారు. ఆదివారం ముగింపు వేడుకల సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలన్నారు.

## దశలవారీగా అభివృద్ధి పనులు



వీరన్నగుట్టబస్తీలో పర్యటిస్తున్న నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్టకాలనీలో సోమవారం మార్నింగ్ వాక్‌లో స్థానికులతో మాట్లాడారు. కాలనీలో ఏర్పాటు చేసిన స్తంభాలకు వారం రోజుల్లో హైమాస్ట్ లైట్లను అమర్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. రామాలయం వద్ద సీసీ రోడ్డు పనులకు ప్రణాళికలు రూపొందించామని త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానన్నారు. బస్తీ దవాఖానా వద్ద పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, తాగునీటి పనులను త్వరలో పూర్తి చేయిస్తానని పేర్కొన్నారు.

## మిత్రుడిని కలిసిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

చంపాపేట: త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సోమవారం తన చిరకాల మిత్రుడు చంపాపేట డివిజన్ రెడ్డిబస్తీకి చెందిన మందా సత్యనారాయణ రెడ్డి నివాసానికి వచ్చి సరదాగా గడిపారు. అనంతరం ఆయన సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రాగార్డెన్ నిర్వాహకులు మంద రాంచంద్రారెడ్డి, లక్ష్మీ గార్డెన్ నిర్వాహకులు రమణారెడ్డి, నాయకులు సిల్వేరి అనిల్‌కుమార్, రమేష్, రాజేష్, మల్లికార్జున్, జిట్టా తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



ఇంద్రసేనారెడ్డితో మంద సత్యనారాయణరెడ్డి

# తవ్వారు.. మరమ్మతు మరిచారు..





ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేస్తామని తవ్వి ఆ తర్వాత ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. కుర్మగూడ డివిజన్ భరత్‌నగర్ బస్తీలో నూతన రోడ్డు వేయడానికి పాత రోడ్డును తవ్విన అధికారులు దాదాపు నెల కావస్తున్నా పనులు చేపట్టడం లేదు. రోడ్డంతా కంకర తేలి గుంతలమయంగా మారింది. చినుకు పడినా.. ఇళ్లలో నుంచి కొద్దిపాటి నీరు బయటకు వచ్చినా రోడ్డంతా బురదమయంగా మారుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. –చంచల్‌గూడ